క్లుప్తంగా

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు



పెడన:పట్టణంలో వేంచేసి ఉన్న శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని శ్యామలాంబదేవి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గూడూరు వీరవెంకట సుబ్బరత్నాకర్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని దేవాంగులంతా కలిసి పెద్ద ఎత్తున శ్యామలాంబ దేవికి ఆషాఢ సారెను సమర్పించారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉటుకూరి సుబ్రమణ్యేశ్వరరావు, బందారు ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ మొబైల్ డయోగ్నొస్టిక్ యూనిట్ బస్సు ద్వారా 75 మందికి పలు రకాల క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె. సువర్చల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మొబైల్ ల్యాబ్‌లో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, మెమోగ్రాం, పలు రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యాధికారి జయశ్రీ, సూపర్‌వైజర్లు ఎం.ఏసుదాసు, ఎం. ఏడుకొండలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

మోపిదేవి:గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన రూ. 43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌చే ప్రారంభించనున్నట్లు గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం



మోపిదేవివార్పు(మోపిదేవి):సాగునీటి రంగానికి సర్ ఆర్థర్ కాటన్ అందించిన సేవలు చిరస్మరణీయమని అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని మోపిదేవి వార్పు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సైనికాధికారిగా మన దేశానికి వచ్చిన కాటన్ నీటిపారుదల ఇంజినీరుగా లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చే ప్రాజెక్టులు నిర్మించి రైతులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు.

అదృశ్యమైన యువతి హైదరాబాద్‌లో గుర్తింపు

బంటుమిల్లి: మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన యువతిని పోలీసులు ఫోన్ లొకేషన్ ద్వారా హైదరాబాదులో గుర్తించారు. ఈ నెల 23వ తేదీన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి ఫోన్ లొకేషన్ ద్వార ఆమె హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించారు. గురువారం యువతిని తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. సరుకుల కోసం బంటుమిల్లి వచ్చిన ఆమె చెప్పకుండా అంతదూరం ఎందుకు వెళ్లిందా అని విచారించారు. ఇటీవల ఇష్టం లేని పెళ్లి చేయడంతో కోపంతో ఇంటి నుంచి అదృశ్యమైనట్లు చెప్పింది. యువతి క్షేమంగా ఇంటికి చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకికి నివాళి



మచిలీపట్నంటౌన్:గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతిని గురువారం కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంతో సమానంగా గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపి గ్రంథాలయాల ప్రాధాన్యతను, పుస్తకాల విలువలను, మానవాళికి చాటి చెప్పిన మహనీయులు అయ్యంకి వెంకటరమణయ్య అని కొనియాడారు. ఉప గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ వెంకటరమణయ్య జీవిత విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వరి నారుకు డిమాండ్!

- రైతులకు నారు దొరకని పరిస్థితి
- ధరలు ఎక్కువైనా కొనుగోలు చేస్తున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు

పెడన:సమయానికి సాగునీరందక వెద వేసిన సాగు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిగా ఎండిపోయి కొత్తగా నారు కొని తెచ్చుకుందామని కొందరు రైతులు భావిస్తున్నారు. అక్కడక్కడ ఎండిపోయి, కొన్ని చోట్ల బతికిన నారుకు అదనంగా నాట్లు వేద్దామని నారు కోసం ప్రయత్నిస్తున్న అన్నదాతలు అధికమయ్యారు. తాము వేసిన విత్తనం నారు ఎక్కడ దొరుకుతుందా, దాని ధర ఎంత ఉంటుందోనని ఆరా తీస్తున్నారు. అంతే కాకుండా ఆ నారును బేరం ఆడి తెచ్చుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 60 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుండగా సుమారు 35 వేలు నుంచి 40 వేల ఎకరాలు వరకు వెద సాగును అనుసరించారు. ఏరువాక పౌర్ణమి రోజును పురస్కరించుకుని చాలా మంది వెద సాగును ప్రారంభించి వర్షాలు పడక, కాలువలు ద్వారా నీరందక ఎండిపోయిన దుస్థితి. వెదసాగు పూర్తిగా ఎండిపోగా మళ్లీ వెదసాగు వేసి నీటిని అయిల్ ఇంజిన్లు ద్వారా తోడి బతికించుకున్నారు. వెదసాగులో అక్కడక్కడ ఎండిపోయి పలుచగా ఉండటంతో పూర్తిస్థాయిలో నాట్లు వేయాలనే ఆలోచనల్లో రైతన్న ముందుకు అడుగులు వేస్తున్నారు.

అధిక ధరలైనా తెచ్చుకునేందుకు.....

సెంటు ఆకు (నారు)ధర రూ.300 నుంచి రూ.1000 వరకు పలుకుతుంది. దీంతో రైతన్నలు బేరం ఆడి ట్రాన్స్‌పోర్టు చార్జీలు అదనంగా చెల్లించుకుని ఆకును తెచ్చుకుంటున్నారు. మరికొందరు



మినీ వ్యానులో తరలిస్తున్న నారు



ద్విచక్ర వాహనంపై నారు తీసుకువెళ్తున్న రైతు

రైతులు ద్విచక్ర వాహనాలపైన ఒక సెంటు లేదా రెండు సెంట్లు చొప్పున ఆకును కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. పూర్తిగా ఎకరం పొలం అంతా ఆకు కావాల్సిన వారు మినీ వ్యాన్లల్లో, ట్రాక్టర్లలో ఆకును తెచ్చుకుని నాట్లు వేసే పనిలో తలమునకలయ్యారు. సెంటుకు 8 నుంచి 15 పోగులు అవుతున్నాయి. ఎకరానికి పది నుంచి 15 సెంట్లు వరకు ఆకు కొనుగోలు చేస్తున్నారు. పది సెంట్లు ఆకు ధర రూ.3వేలు నుంచి రూ.10వేలు వరకు విత్తనం రకాన్ని బట్టి రైతులు కొనుగోలు చేస్తున్నారు.

డోకిపర్రు నుంచి తెచ్చుకుంటున్నా

ఆకు ధర తక్కువగా దొరుకుతుందని డోకిపర్రు నుంచి ఆకును కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నా. వెద సాగు వేశా. అక్కడక్కడ నాట్లు వేయాల్సి ఉండటంతో రెండు సెంట్లు ఆకును కొని తీసుకువస్తున్నా. సెంటు ధర రూ.400కు కొన్నా. స్థానికంగా దొరకడం లేదు. దూరం నుంచి అదీ కూడా ఎక్కువ వేసిన వారు అమ్మితేనే కొనుగోలు చేసేది. వారికి తక్కువైతే ఆకు దొరకని దుస్థితి. రైతు కష్టాలు అన్ని ఇన్ని కావు.

–గోపని నాగబాబు, రైతు, నందమూరు, పెడన మండలం

పలువురిని పరామర్శించిన పేర్ని

కోనేరుసెంటర్:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం బందరు మండలంలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన పలువురు కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. తొలుత ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామానికి చేరుకుని మండల పార్టీ నార్త్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మట్టా మోహననాంచారయ్యను పరామర్శించారు. ఇటీవల నాంచారయ్య తండ్రి జగన్‌మోహన్‌రావు అనారోగ్యంతో మరణించగా పేర్ని నాంచారయ్యను కలిసి పరామర్శించారు. జగన్‌మోహనరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాంచారయ్య కుటుంబానికి ధైర్యం చెప్పారు. పెదయాదర గ్రామంలో ఇటీవల మరణించిన విశ్వతి శివన్నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే చిన్నాపురం గ్రామానికి చేరుకుని గ్రామ ఇన్‌చార్జ్ జంపాన సుబ్రహ్మణ్యంను పరామర్శించారు. ఇటీవల సుబ్రహ్మణ్యం మేనమామ అకాల మరణం చెందటంతో ఆయన చిత్రపటానికి నాని నివాళులు అర్పించారు. మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ మండల అధ్యక్షుడు, పోతేపల్లి మాజీ ఎంపీటీసీ పిప్పళ్ళ నాగబాబు, సౌత మండల అధ్యక్షుడు రమేష్, బుద్దాలపాలెం పార్టీ నాయకుడు మందా బాబురావు, పెదయాదర పార్టీ నాయకులు అర్జా రమణ, శంకర్, నగరపార్టీ నాయకులు చిటికిన నాగేశ్వరరావు, బడే భాను, పరింకాయల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మట్టా జగన్‌మోహనరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేర్ని నాని

ఆక్రమణకు గురైన శ్మశానవాటికను సర్వే చేయించండి

కోడూరు:కోడూరు పంచాయతీ పరిధిలోని 4,5,6,7 వార్డులకు సంబంధించి ఆక్రమణకు గురైన శ్మశానవాటికను సర్వే చేయించి, అభివృద్ధి చేయాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. గురువారం ఆయా వార్డులకు చెందిన కాలనీవాసులు శ్మశానవాటిక విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీఓ సుధాప్రవీణ్‌కు వినతి పత్రం అందించారు. దింటిమెరక రహదారికి అనుకొని వడ్డెరకాలనీలో ఉన్న శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి మార్గం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. శ్మశానవాటికను చుట్టూ పక్కల రైతులు తమ పొలాల్లో కలుపుకున్నారని, దీంతో దహనకాండలు జరిపేందుకు కూడా వీలు లేకుండా పోయిందని తెలిపారు. వెంటనే రెవెన్యూ అధికారులు శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి, రహదారి మార్గాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్, ఎంపీడీవోలు హామి ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామ ప్రముఖులు

నాయకులను పరామర్శించిన సింహాద్రి

మోపిదేవి:మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు గురువారం సాయంత్రం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇటీవల హాస్పటల్ నుంచి వచ్చి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ నాయకులకు ధైర్యం కల్పించారు. మెరకనపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కన్వీనర్ యర్రంశెట్టి రాంబాబు(గుండె వ్యాధి), ఇదేగ్రామానికి చెందిన ముత్యాల బాలాజీ(గుండెవ్యాధి), జంపాన శ్రీనివాసరావు (కిడ్నీ క్యాన్సర్) లను పరామర్శించి వారి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. పెదకళ్లేపల్లిలో గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు (గుండెవ్యాధి), తైలం బ్రహ్మరాజు(గుండెవ్యాధి)ను పరామర్శించారు. ఆయన వెంట మెరకనపల్లి గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మీ, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, బందారు సూరిబాబు, లింగం జగదీష్‌కుమార్, ముత్యాల గోపాలరావు, ఆకుల కోటేశ్వరావు, మెరకనపల్లి కృష్ణారావు, అందె పోతురాజు, ఆది, పండలనేని శివప్రసాద్, అరజా వెంకట సుబ్బారావు, గండు సాంబశివరావు, అరజా వెంకట చలపతిరావు, చెన్నకేశవుల నాని తదితరులు ఉన్నారు.



పెదకళ్లేపల్లిలో గ్రామ పార్టీ కన్వీనర్ దుర్గారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

సూరికి పేర్ని కిట్టు నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 46వ డివిజన్ నారాయణపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బోడిచర్ల సూరి (70) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సూరి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సూరి ఇంటికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్పొరేటర్ భోగాదుల సాయిబాబు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాస్, చీలి చక్రపాణి, బడే భాను తేజ తదితరులు ఉన్నారు.

సర్వే వేగవంతం చేయండి

పెడన:మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పీ-4 సర్వేను వేగవంతం చేయాలని డెప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి ఆదేశించారు. మండలంలోని కొంకేపూడి, చేవేంద్ర, చెన్నూరు గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించి సర్వే వివరాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు 54 శాతం మాత్రమే అయ్యాయని, మిగిలిన 46 శాతం కూడా త్వరిగతిన పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా 9,232 అసెస్‌మెంట్లు ఉన్నాయని, వీటిల్లో 5,043 అసెస్‌మెంట్లు పీ-4లోకి వచ్చాయని, మిగిలిన 4,183 కూడా సర్వేలోకి రావాల్సి ఉందన్నారు.

బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు సత్కారం

కృత్తివెన్ను:విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతగా వ్యవహరించి ఐదేళ్ల ఒకేచోట ఉద్యోగం పూర్తిచేసి వేరే మండలానికి బదిలీపై వెళుతున్న యండపల్లి సచివాలయ ఉద్యోగులను సత్కరించారు. గురువారం సాయంత్రం యండపల్లి సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరిలు బదిలీపై వెళుతున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ధనలక్ష్మీ, సర్వేయర్ మనోహర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, ఫిషరీస్ అసిస్టెంట్ వర్ధిని, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మౌనికలను శాలువా, పూలమాలలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పిన్నెంటి బాబ్జీ, డీటీ శాంతి, కార్యదర్శి మహేష్‌లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

చల్లపల్లి:మండల పరిధిలోని వక్కలగడ్డ సచివాలయంలో గతంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, గ్రామ సర్పంచ్ వల్లూరు ఉమ, గ్రామ పెద్దలు గురువారం సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు సురేష్, దివ్యసాయి, నళిని, వెంకటలక్ష్మీ, సౌమ్య, కవితలను శాలువాలతో కప్పి, నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కొత్తగా ఇక్కడికి వచ్చిన సచివాలయ ఉద్యోగుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు.



యండపల్లి సచివాలయం వద్ద ఉద్యోగులను సత్కరించిన సర్పంచ్, కార్యదర్శులు



ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ వల్లూరు ఉమ తదితరులు

గుర్రపుడెక్క తొలగింపు పనుల పరిశీలన

అవనిగడ్డ:ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో గుర్రపడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం పరిశీలించారు. నియోజకవర్గంలో రూ.2.25 కోట్ల నిధులతో కాలువలు, డ్రెయిన్లు పనులు చేసినా ఒక్క రోజు కురిసిన వర్షానికే ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో డ్రెయిన్లలో గుర్రపడెక్క పేరుకుపోవడం, పంట పొలాలు ముంచెత్తిన పరిస్థితిని సాక్షిలో 23వ తేదీన మాటలతో సరి..ముంచేశాయి మరి శీర్షికన కథనం ప్రచురితమైంది. ఘంటసాల మండలం దేవరకోటలో చేపట్టిన గుర్రపడెక్క పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. పనుల గురించి డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావుని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

చల్లపల్లి:మండల పరిధిలోని కొత్తమాజేరు వద్ద గుండేరు డ్రెయిన్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. తూటు, గుర్రపుడెక్క పేరుకుపోయి ప్రవాహానికి అడ్డుపడటంతో ఈ నెల 20వ తేదీన వాటి తొలగింపు పనులు ప్రారంభించారు. అయితే ఐదు రోజుల తరువాత గురువారంతో పనులు పూర్తిచేశారు. అలాగే వంతెన వద్ద రోడ్డుకు పడిన గండిని పూడ్చారు. ఈపనులను బుద్ధప్రసాద్ వచ్చి పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోకుండా రివిట్‌మెంట్ బలంగా వేయాలని అధికారులకు సూచించారు.



దేవరకోట వద్ద గుండేరు డ్రెయిన్‌లో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

29, 30 తేదీల్లో మొబైల్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రం

కోనేరుసెంటర్:బందరు మండలం మంగినపూడి బీచ్ లైట్‌హౌస్‌కు సమీపంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మొబైల్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రంను నిర్వహిస్తున్నట్లు బందరు ఎంపీడీవో కిషోర్ తెలిపారు. పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు రూ. 1500 చెల్లించి మండల పరిషత్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పాస్టపోర్ట్ కోసం బందరు ప్రజలు విజయవాడ కార్యాలయం వరకు వెళ్లి ప్రయాస పడకుండా ఉండేలా జిల్లా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పాస్‌పోర్ట్ కావాలనుకున్న వారు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతో పాటు ఓటరు ఐడి, పదో తరగతి మార్కులు జాబితా, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబరు జత పరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి

చల్లపల్లి: విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవటం వల్ల భవిష్యత్తులో ఉన్నతంగా ఆలోచిస్తారని చల్లపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మురారి సాత్విక్ అన్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమంలో భాగంగా ఐర్లాండ్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న చల్లపల్లికి చెందిన సాత్విక్ మురారి భాగస్వామిగా చేరి అందులో భాగంగా పేద విద్యార్థులకు విదేశి విద్యను అందించేందుకు ముందుకు వచ్చారు. గురువారం ఆయన తాను చదువుకున్న స్థానిక విజయా అకాడమికి వచ్చి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ గొర్రెపాటి వెంకటరామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు తదితరులు సాత్విక్‌ను సత్కరించారు. ప్రతి ఒక్కరూ సాత్విక్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదివి స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాత్విక్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు ముఖ్యమంత్రికి తనవంతుగా రూ.50లక్షలు విరాళం అందించినట్లు చెప్పారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగిన తరువాత ప్రతి ఒక్కరూ ఎక్కడ నుంచి వచ్చామన్నది మరిచిపోకుండా పేదలు, ప్రతిభావంతులకు సహాయం అందించాలని కోరారు.



చల్లపల్లి విజయ అకాడమీలో ప్రసంగిస్తున్న ఎన్ఆర్ఐ సాత్విక్ మురారి

గంగాభవాని అమ్మవారికి ఆషాఢ సారె

కోడూరు:భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారికి భక్తులు గురువారం ఆషాఢ సారెను సమర్పించారు. కోడూరు వడ్డెరకాలనీకి చెందని మహిళలు డీజే, డప్పువాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారికి గాజులు, పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల మిఠాయిలను సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చౌడేశ్వరీ అమ్మవారికి ఆషాఢ సారె

చల్లపల్లి: పడమరవీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరీ అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా గురువారం దేవాంగ మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఉమ్మిటి దేవీకుమారి ఇంటి వద్ద నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో సారె తీసుకుని బయలుదేరిన మహిళలు ఊరేగింపుగా వెళ్లి తొలుత గ్రామ దేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. అక్కడి నుంచి తిరిగి వచ్చి శ్రీరామ లింగ చౌడేశ్వరీ అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అర్చకులు విశ్వనాథం, బట్ట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమ్మిటి దేవికుమారి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఆషాఢ సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున వెళుతున్న దేవాంగ మహిళలు

వీఎస్ అచ్యుతానందన్ సేవలు మరువలేనివి

మచిలీపట్నంటౌన్:కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ పేద ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.ధనుంజయరావు తెలిపారు. బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం వీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ పేదల కోసం పోరాడే పార్టీ ఏదైనా ఉంది అంటే అది సీపీఎం అని చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగత రమాదేవి, సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రమణ్యం, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీ యూనస్, ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు టి.చంద్రపాల్, జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పామర్తి నాగయ్య, స్థానిక సీఐటీయూ ఆఫీస్ కార్యదర్శి నారాయణ తదితరులు ఉన్నారు.

కొత్తమాజేరు వంతెనపై రాకపోకలు ప్రారంభం

చల్లపల్లి:మండల పరిధిలోని కొత్తమాజేరు వంతెనపై రాకపోకలు గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. గుండేరు డ్రెయిన్ నీటి ప్రవాహానికి వంతెనకు ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు కోతకుగురై గండి పడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ఈనెల 23వ తేదీన ప్రారంభంకాని రాకపోకలు అనే శీర్షికన సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా దీనికి వెంటనే స్పందించిన అధికారులు అవసరమైన మెటీరియల్‌ను తెప్పించి గండిని పూడ్చారు.

పోయినది

చిరివెళ్ళ పావని D/o. వెంకన్న డోర్ నెం. 2/27, రామరాజుపాలెం గ్రామం, గూడూరు మండలం అను నాకు చెందిన 10th Class ఒరిజినల్ మార్కుల సర్టిఫికెట్ రిజిష్టర్ నెం. 2013103989 గూడూరులోని మీసేవ సెంటర్‌కు వెళుతుండగా మార్గమధ్యలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

సంప్రదించండి : 98660 87951

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

కోడూరు:ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల నుంచి బహిరంగంగానే మామూళ్లు వసూళ్లు చేస్తున్న ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి అవనిగడ్డ ఎక్సైజ్ అధికారులు కోడూరు మద్యం దుకాణాల్లోని రికార్డులను పరిశీలించేందుకు వచ్చారు. అయితే ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల్లో ఉండగానే, దుకాణాల వెనుక వైపు మద్యం బాబులు యథేచ్ఛగా మద్యం సేవిస్తూ కనిపించారు. దుకాణాల వద్ద మద్యం సేవించడానికి అనుమతి లేకపోయినా కూడా మందుబాబులు మద్యం సేవిస్తున్నా కూడా ఎక్సైజ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఇక కొంతమంది ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాల్లోని కౌంటర్ బల్లలపై తాపిగా కూర్చొని మందుబాబుల ఆగడాలు తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరించారు. రికార్డుల తనిఖీ పేరుతో అధికారులు మద్యం వ్యాపారుల నుంచి బహిరంగంగానే ముడుపులు తీసుకుని వెళ్లారని మద్యం కొనుగోలుకు వెళ్లిన మద్యం బాబులే బాహాటంగానే చెబుతున్నారు. రాత్రి 8గంటల సమయంలో కూడా ఎక్సైజ్ అధికారులు ముడుపుల కోసం మద్యం దుకాణాల వద్దకు రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న బెల్టు షాపులకు భారీ మొత్తంలో మద్యం సీసాలు తరలివెళ్లడానికి కూడా ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేపల చెరువులో విషప్రయోగం

కృత్తివెన్ను:చేపపిల్లల చెరువులో విషప్రయోగం జరిగినట్లు రైతు కాలాబత్తుల హేమాచలం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు లీజుకు తీసుకుని కొంత కాలంగా చేపపిల్లల పెంపకం చేస్తున్నానన్నారు. మూడు నెలల క్రితం చెరువులో తుల్లు జాతికి చెందిన లక్ష చేపపిల్లలను వేసి పెంచుతున్నానని తెలిపారు. ప్రస్తుతం ఒక్కొక్క చేపపిల్ల ధర రూ. 4 పలుకుతుందన్నారు. గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి పైకితేలి ఉన్నాయన్నారు. మొత్తం చెరువులోని చేపలన్నీ చనిపోవడంతో విషప్రయోగం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. షుమారు రూ. 3 లక్షలకు పైగా నష్టం వాటినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

చల్లపల్లి:మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) అవనిగడ్డ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక ఎన్‌టీఆర్ పార్కులో ఎంఈఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు నూతన కమిటీని ప్రకటించారు. అవనిగడ్డ నియోకవర్గ అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ రమేష్, సెక్రటరీగా సిద్దెల యలమందయ్య, కోశాధికారిగా కొల్లూరి మోహనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రావెళ్ళ వరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొకినేల కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు జనరల్ సెక్రటరీ బీడెల్లి మరియకుమార్, ట్రెజరర్ రాజపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కారుమూరి వెంకయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చల్లపల్లి: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గతంలో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వటం వల్ల ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.